క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ట పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

కొలిమిగుండ్ల: స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో నిర్మించిన త్యాగరాజస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయి. వేదపండితుడు ఆలూరి రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, గణపతి పూజ, అభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. నాయీ బ్రాహ్మణ కుటుంబాలు పూజల్లో పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శుక్రవారం ధ్వజస్తంభం, త్యాగరాజ స్వామి, సీతా, లక్ష్మణ, కోదండరామస్వామి విగ్రహాల ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విగ్రహాల ప్రతిష్టను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఎస్ఐగా దుగ్గిరెడ్డి బాధ్యతలు



బనగానపల్లె: మండల ఎస్ఐగా దుగ్గిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కసాపురం పోలీస్ స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ బ్యాగులు విక్రయిస్తే చర్యలు



వ్యాపారుల నుంచి ప్లాస్టిక్ కవర్లు సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్ టౌన్: ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లు క్రయవిక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జయరాం హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం డోన్ పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పాతబస్టాండ్ ప్రాంతంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేసి 10 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులను వినియోగించొద్దని.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు.

3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు

డోన్ రూరల్: మండలంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.నాగమణి తెలిపారు. రైతులు, గ్రామస్తులు రెవెన్యూ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.


20 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తి



గ్రామాల్లో పంట నమోదు చేస్తున్న సిబ్బంది

బేతంచెర్ల: మండలంలో 20 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటల నమోదు పూర్తయినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందన్నారు. ఇంకా మండలంలో 14వేల ఎకరాల్లో పంట నమోదు చేయాల్సి ఉందని చెప్పారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని రైతులకు సూచించారు.

మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ మరియదాసు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు ఉన్నారు.

వైద్య సిబ్బందికి రక్షణ అవసరం



బనగానపల్లె ఏరియా ఆస్పత్రిలో మహిళా వైద్యులు, సిబ్బంది షిఫ్టుల ప్రకారం 24 గంటలు సేవలు అందిస్తున్నారు. వీరికి రక్షణ అవసరం. ముఖ్యంగా రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే మహిళా సిబ్బంది భద్రతపై దృష్టి సారించాలి. ఆస్పత్రి వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సెక్యూరిటీని పటిష్టం చేయాలి. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టాలను బలోపేతం చేయాలి.

–సుజాత, సివిల్ సర్జన్, బనగానపల్లె ఏరియా ఆస్పత్రి

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దారుణం. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సమాజంలోని ఇలాంటి మృగాల నుంచి మహిళా వైద్యులు, సిబ్బందిని రక్షించేలా ప్రభుత్వం పటిష్ట చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉంది. పనిచేసే ప్రదేశంలోనే మహిళలకు రక్షణ లేకుంటే ఎలా? ఆస్పత్రుల వద్ద సెక్యూరిటీ, పోలీస్ సిబ్బందితో రక్షణ కల్పించాలి.

–కవిత, స్టాఫ్‌నర్సు, బేతంచెర్ల సీహెచ్‌సీ



మౌలిక వసతులు కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి. పలుచోట్ల వాష్‌రూమ్‌లు లేకపోవడంతో వైద్యులు, పారామెడికల్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వైద్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి సౌకర్యాలను కల్పించాలి. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలి.

–డాక్టర్ రాంభూపాల్, కొత్తబురుజు

మతసామరస్యానికి ప్రతీక... పెద్దరాజుస్వామి ఉరుసు

- మూడురోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- 31వ తేదీ గంధోత్సవంతో ప్రారంభం
- సెప్టెంబర్ 1వ తేదీ ఉరుసు, 2న తేదీ జియారత్‌తో ముగింపు
- కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల నుంచీ రానున్న భక్తులు



ముస్తాబైన దర్గా



గంధం రోజున పెద్దరాజు స్వామికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి(ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన శ్రీహజరత్ సయ్యద్ షా అబ్దుల్ రహమాన్ ఇద్రూస్‌బాషా ఉరఫ్ పెద్దరాజులస్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతోంది. భక్తులకు అండగా నిలిచే పెద్దరాజుస్వామి దర్గాను కులమతాలకు అతీతంగా దర్శించుకుంటారు. ప్రత్యేకించి ఏటా మూడురోజుల పాటు ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 31న గంధం, సెప్టెంబర్ 1న ఉరుసు, 2న జియారత్ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా నిర్వాహకుడు గురుసయ్యద్‌షా బాషా ఖాద్రి తెలిపారు.

పెద్ద రాజుస్వామి దర్గా చరిత్ర

పెద్దరాజుల స్వామి 600 ఏళ్ల క్రితం తొమిదేళ్ల వయసులో సౌది అరేబియా నుంచి భారతదేశానికి వచ్చారు. తొలుత కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌లో కొన్నేళ్లు నివాసం ఉండి అనంతరం ఆదోని పట్టణానికి వచ్చారు. ఈయనకు ముగ్గురు భార్యలు. ఇద్దరు భార్యలకు సంతానం లేదు. మొదటి భార్యకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, కుమార్తె. ఆ తర్వాత కొన్నేళ్లకు స్వామివారు అక్కడి నుంచి గూటుపల్లెకు వచ్చినట్లు చరిత్ర. అయితే అక్కడంతా దట్టమైన అడవి. ఈ ప్రాంతంలో యాదవులు ఆవులు, గొర్రెలు మేపుతూ జీవనం సాగించేవారు. స్వామివారు తన తండ్రి ఆజ్ఞానుసారం చేతి కర్రను తీసుకుని గూటుపల్లెలో ప్రస్తుతం దర్గా స్థలంలో నాలుగు రకాలుగా నమాజు చేసిన తర్వాత మిస్వాక్ పుల్ల మొక్కగా మారింది. ఆ వెంటనే రాత్రి పాతిన ఆసా తీసి వాసన చూడగా తన స్వగ్రామమైన ఆదోని భూమి వాసన వచ్చిందని నానుడి. తన తండ్రి కూడా ఇదే నివాసం అని చెప్పడంతో గూటుపల్లె గ్రామ ఏర్పాటుకు సంసిద్ధులయ్యారు. ఇక్కడ గ్రామానికి ఏర్పాటు చేసి ఖుదాపల్లె అని నామకరణం చేశారు. కాలక్రమేణా గూటుపల్లెగా మారింది. స్వామివారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని సంతతి ఇప్పుడు ఉన్న పీఠాధిపతుల వంశం.

ఆరేళ్లలోనే పీఠాధిపతిగా సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ



పెద్దరాజు దర్గాకు 13వ పీఠాధిపతిగా సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ ఆరేళ్ల వయసులోనే బాధ్యతలు చేపట్టారు. పదిహేనేళ్ల క్రితం 12వ పీఠాధిపతి అయిన సయ్యద్ హాఖానీ బాషా అకాల మరణంతో వంశ పారంపర్యంగా పీఠాధిపతిగా అతని కుమారుడైన సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ పిన్న వయసులోనే బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. గూటుపల్లె పీఠంతో పాటు భారత దేశంలోని 90 పీఠాలకు పీఠాధిపతిగా ఆయనే వ్యవహరిస్తుండడం విశేషం.

స్వామివారి మహిమలు

పెద్దరాజుస్వామి గూటుపల్లెలో గొర్రెల కాపరుల భయం పోగొట్టేందుకు పులులను తీగలతో కట్టి తీసుకొచ్చినట్లు పెద్దల మాట. పులులనే తీగలతో కట్టేయడంతో ఇద్రూస్ బాషాకు పెద్దరాజు అని పేరు వచ్చింది. అప్పటి నుంచి ఆయనను పెద్దరాజు స్వామిగా పిలుస్తున్నారు. దర్గా ఆవరణలో దయ్యం, భూతం, పిశాచి పీడలు కలవారు ఒక్క రోజు నిద్ర చేస్తే తొలిగిపోతాయని భక్తుల నమ్మకం.

గూటుపల్లెను సందర్శించిన ఔరంగ జేబు

మొఘల్ సామ్రాజ్యపతనానికి కారకుడైన ఔరంగజేబు 1681లో ఈ గ్రామాన్ని సందర్శించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ కాలంలోనే ఔరంగజేబు పెద్దరాజస్వామికి వేలాది ఎకరాల మాన్యం ఇచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి.

ఉరుసుకు ప్రత్యేక ఏర్పాట్లు



పెద్దరాజుస్వామివారిని దర్శించుకోవడానికి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నాం. సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ నెల 31న గంధోత్సవం, సెప్టెంబర్ 1వ తేదీ ఉరుసు, 2 జియారత్ ఉత్సవాలు ఉంటాయి.

–గురుసయ్యద్‌షా బాషా ఖాద్రి, దర్గా నిర్వాహకుడు

రేపు డోన్‌లో నిరసన ప్రదర్శనలు

ప్యాపిలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను నిరసిస్తూ శుక్రవారం డోన్‌లో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు కృష్ణానాయక్ కోరారు. బుధవారం ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలన్నారు. సీపీఎస్ కంటే మెరుగైన విధానం అంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ విధానం ఉద్యోగులను మోసం చేయడమే అన్నారు. ఈ విధానాన్ని నిరసిస్తూ డోన్ పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్, యూటీఎఫ్ నాయకులు నాగమద్దయ్య, సాలయ్య, నాగాంజనేయులు, లోకేశ్వరి, వాణీబాయి, సోనీ, మారుతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్‌ను సద్వినియోగం చేసుకోండి

కొలిమిగుండ్ల: చదువుకోవాలని ఆసక్తి ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల మధ్యలో చదువు ఆపేసిన వాళ్లు ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాజయ్య అన్నారు. సాధారణ ఫీజుతో బుధవారంతో గడువు ముగిసినా రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 14, 15 ఏళ్లు దాటిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ చదువుకోవచ్చని చెప్పారు. నియోజకవర్గంలో బనగానపల్లె ఉన్నత పాఠశాల, కోవెలకుంట్ల ఉన్నత పాఠశాలల్లో ఓపెన్ స్కూల్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు రాసిన తర్వాత మార్కులిస్టులు నేరుగా అభ్యర్థుల ఇళ్లకే పోస్టు ద్వారా వస్తాయని తెలిపారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్‌కుమార్

కోవెలకుంట్ల: పట్టణంలో లైంగిక దాడికి గురైన మానసిక మైనర్ బాలిక కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాలికపై ముగ్గురు యువకులు లైంగిక దాడి చేయడంతో పాటు సెల్‌ఫోన్‌తో వీడియో, ఫొటోలు తీసి వైరల్ చేశారన్నారు. విషయం తెలిసిన వెంటనే కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనపై విచారణ జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయ రికార్డులు పరిశీలించి సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. డీఐజీ వెంట ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డీఎస్పీ రవికుమార్ ఉన్నారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్‌యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ కె.నాగమణి, ఏఈ నారాయణ, సతీస్, ఎంఈఓ ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం



అయ్యప్పస్వామి గుడి వద్ద పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

డోన్: ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. బుధవారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ పరిసర ప్రాంతాల్లో డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానికులకు వివరించారు. నీటి నిల్వలు ఎక్కువ రోజులు ఉంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు నీరు నిల్వ చేసిన పాత్రలు, తొట్టెలను ఖాళీ చేసి పొడిగా ఉంచాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం వల్ల దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయంలో స్థల యజమానులకు చట్టప్రకారం జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అభయ వీరాంజనేయ స్వామి గ్రామోత్సవం



అభయ వీరాంజనేయస్వామి

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో అభయ వీరాంజనేయస్వామి దశమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, ఆకుపూజ, గోపూజ, హోమం తదితర పూజలు చేశారు. సాయంత్రం గ్రామంలో అభయ వీరాంజనేయస్వామిని ఊరేగించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

బేతంచెర్ల: చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజసేవలో పాలు పంచుకోవాలని సీఐ డి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని దుర్గాపేట కాలనీ పర్యటించి స్థానికులతో సమావేశం నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అందరితో మంచిగా మెలగాలని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నిర్మూలనకు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ఒక్క సారి కేసు నమోదైతే స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

డోన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి, బోయ సేవాసమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ మహేశ్వరరెడ్డి కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. వాల్మీకి సంఘం నాయకులు బాలమద్దిలేటి, శ్రీధర్, శ్రీనాథ్, రాజు, రాజశేఖర్, కంబగిరి స్వామి, చౌడేష్ తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

కొలిమిగుండ్ల: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సీఐ రమేష్ బాబు వివరాల మేరకు.. బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ చెక్‌పోస్ట్ సమీపంలో నివాసం ఉండే బొంగురు తేజ(35) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 19న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మహిళపై దాడి.. ఇద్దరిపై కేసు

సంజామల: మండల కేంద్రంలో మహిళపై దాడి చేసి గాయపరిచిన ఇద్దరిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సి.రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. సంజామల గ్రామానికి చెందిన మల్లారి నాగలక్ష్మమ్మ అదే గ్రామానికి చెందిన మల్లారి మల్లికార్జునకు కొంత కాలం క్రితం నగదు ఇచ్చింది. ఆమెకు డబ్బులు అవసరం కావడంతో సోమవారం తిరిగి ఇవ్వాలని కోరింది. తమనే డబ్బులు అడుగుతావా అంటూ మల్లారి మల్లికార్జున, మల్లారి నాగ వెంకటేశ్వర్లు నాగలక్ష్మమ్మను కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని బుధవారం దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నెల జైలు శిక్ష

కోవెలకుంట్ల: మద్యం మత్తులో నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్‌కు బుధవారం జైలు శిక్ష పడింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. లారీ డ్రైవర్ అతిగా మద్యం సేవించి కోవెలకుంట్ల వైపు వస్తుండగా పట్టణ శివారులో పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. ఈ మేరకు డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ అబ్దుల్ రహిమాన్ నెల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామంలో మద్యం విక్రయిస్తు న్న సలాది బాలకృష్ణుడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. అతని వద్ద నుంచి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవం.. శ్రీకృష్ణుని గ్రామోత్సవం



ప్యాపిలి: గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అవుకులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. త్రైత సిద్ధాంతం, ఇందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల మీదుగా శ్రీకృష్ణుని ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. జమాల్ బాషా అనే ముస్లిం శ్రీకృష్ణుని పల్లకీని మోసి మతసామరస్యాన్ని చాటారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివప్రసాద్, సుధాకర్ నాయుడు, పుల్లయ్య, మధు, మల్లికార్జున, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రంలో క్రిష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి –ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మార్కెట్ వీధిలో క్రిష్ణుడిని కొలువుదీర్చి మూడు రోజుల పాటు పూజలు నిర్వహించారు. చివరి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మార్కెట్, బస్టాండ్, తేరువీధి, రాజా వీధి, సెంటర్ వీధి మీదుగా సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామివారిని ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు సమర్పించి కర్పూర హారతులు ఇచ్చారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి– ఇందూ జ్ఞానవేదిక అవుకు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాగంటి ఆలయానికి పెరిగిన ఆదాయం



బహిరంగ వేలాలను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయానికి గత ఏడాది కంటే రూ.2.35 లక్షలు అధికంగా ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో బొమ్మలు, పండ్లు, ఐస్‌క్రీం విక్రయాలు, కొబ్బరికాయలు, తలనీలాల సేకరణకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. బొమ్మలు, పండ్లు విక్రయించుకునే హక్కును మీరాపురం గ్రామానికి చెందిన బి.గోపాల్‌రెడ్డి రూ.6.55 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. ఐస్‌క్రీం విక్రయించుకునే హక్కును పాతపాడు గ్రామానికి చెందిన ఒలేటి మధుసూదన్ రూ.4.70 లక్షలకు దక్కించుకున్నారన్నారు. ఈ రెండింటిపై గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 2.35 లక్షలు అదనపు ఆదాయం వచ్చిందని తెలిపారు. కాగా కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణకు సరైన ధర లభించకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ చక్రభరత్, ఆలయ చైర్మన్ తొట బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సర్టిఫికెట్ల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ఎస్టీ కుల సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో పూర్తిగా విచారణ చేసి నిర్ధారించుకున్న తరువాతే జారీ చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటా రాముడు, ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మేడసారి గోపాల్, వెంకటేష్ కోరారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్వర రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొంత మంది అక్రమార్కులు తహసీల్దార్లతో కుమ్మక్కై బోగస్ సర్టిఫికెట్లు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 500 బోగస్ ఎస్టీ సర్టిఫికెట్లు ఉన్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ల జారీలో తగిన జాగ్రత్తలు తీసుకుని నిజమైన ఎస్టీలకు న్యాయం చేయాలని కోరారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రైలు కింద పడి మృతి చెందిన చాకలి గోల్లన్న

డోన్ రూరల్: పట్టణంలోని స్థానిక కర్నూలు రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి రైల్వే జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిశీలించారు. మృతుడు స్థానిక టీచర్స్‌కాలనీకి చెందిన చాకలి గొల్లన్న(42)గా గుర్తించారు. అప్పుల బాధ తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.